సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం ¦ 9 ¦ ఏప్రిల్ ¦ 2024



ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగదు

రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిపై టీడీపీ అభ్యర్థి రామ్‌ప్రసాద్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం తగదని రామాపురం మండల వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. - 2లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సహర్ బుధ (ఉ॥)
రాయచోటి :	6.31	4.49
రాజంపేట :	6.32	4.46
పీలేరు :	6.36	4.40
మదనపల్లె :	6.34	4.50

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.130	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 131 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	420	421
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 101.220 కిలోలు

న్యూస్‌రీల్

కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు



రాయచోటి : ఈ ఏడాది ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ జిల్లా ప్రజలందరికీ తెలుగు నూతన సంవత్సర శ్రీ క్రోధినామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను సంప్రదాయబద్ధంగా ఇంటిల్లిపాది బంధుమిత్రులతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని అభిలషించారు.అలాగే జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణరావులు కూడా జిల్లా ప్రజలకు నూతన తెలుగు సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

మీడియా ప్రతినిధులకు పోస్టల్ బ్యాలెట్

కడప సెవెన్‌రోడ్స్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే మీడియా ప్రతినిధులకు ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందని సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ కోసం ఇప్పటికే కొంతమంది తమ శాఖలో అథారిటీ లెటర్ ఇచ్చారని తెలిపారు. వీరంతా తాము పంపిన ప్రొఫార్మాలో వివరాలు నమోదు చేసి జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో నేరుగా గానీ, వాట్సాప్ నెంబరు 9121215310 ద్వారాగానీ వెంటనే తెలియజేయాలని కోరారు. పనిచేసే డిపార్టుమెంటు, పేరు, హోదా, కార్యాలయ చిరునామా, పోలింగ్ రోజున అప్పగించిన విధులు, ఏ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉన్నారో ఆ నియోజకవర్గ నెంబరు, పేరు, పోలింగ్ కేంద్రం నెంబరు, ఓటరు లిస్టులో సీరియల్ నెంబరు, ఎపిక్ కార్డు నెంబరు, ఫోన్ నెంబరు వంటి వివరాలను తాము పంపిన ప్రొఫార్మాలో సకాలంలో సమర్పించాలని కోరారు.

అవధాని లోకా జగన్నాథ శాస్త్రికి ఉగాది పురస్కారం



రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన అవధాని, కవి పండితుడు లోకా జగన్నాథ శాస్త్రి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని సోమవారం అవధానికి ముని సంస్థ నిర్వాహకుడు కె. రామమూర్తి శర్మ తెలిపారు. కళలు, భాష, అవధానం, వైద్యం బోధన, సేవా రంగం వంటి అంశాలపై విశేష కృషి చేసిన వారికి ఈ పురస్కారం అందిస్తామని తెలిపారు. ఈనెల 11వ తేదీ పుంగనూరు పట్టణంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేస్తామన్నారు.

వీరభద్రస్వామికి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

రాయచోటి టౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి అమావాస్య పూజలతో పాటు పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి వారికి, అమ్మవారి మూల విరాట్‌లకు అమావాస్య పూజలు నిర్వహించి అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించి పల్లకీలో ఉంచి ఆలయ మాడవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ వేడుకలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ. ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు.

వైద్య ఆరోగ్య శాఖల్లో.. డిప్యుటేషన్‌లు రద్దు

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖకు చెందిన అన్ని విభాగాల్లో డిప్యుటేషన్‌లు, వర్క్ ఆర్డర్లు రద్దు అయ్యాయి. ఈ మేరకు ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలలోపు అమలు చేయాలని ఆదేశించారు.

ఊహించని పరిణామం...

ప్రధాన కేంద్రాల్లోని కార్యాలయాల్లో చాలా మంది డెప్యుటేషన్‌లు, వర్క్ ఆర్డర్‌లపై పని చేస్తున్నారు. సక్రమంగా కొందరు..అక్రమంగా మరికొందరు వచ్చి తిష్ట వేశారు. కొంతమంది అవసరం లేకున్నా పలుకుబడితో వచ్చి చక్రం తిప్పారు. ఈ తరుణంలో రద్దు అంశం కొందరికి ఊహించని పరిణామంగా మారింది.

సంక్షేమ గీతం పల్లవించాలి!

- నిన్నటి వసంతం మళ్లీ కావాలి
- కొత్త జీవితాల కోసం ఎదురుచూపు
- నేడు ఉగాది

తెలుగింట మరో వసంతం పలకరించింది..
'శోభకృత్'ను కాల గమనంలోకి నెట్టేస్తూ..
క్రోధిగా ఉదయించింది.
ఉగాది రాకతో తెలుగు లోగిళ్లకు 'కొత్త' కళొచ్చింది.
గుమ్మాలకు కట్టిన తోరణాలు ఊగిసలాడుతున్నాయి.
ప్రజల ఆశల మల్లె..
జీవితంలో పూలపాన్పులే కాదు..
రాళ్లూ ముళ్లూ ఉంటాయంటూ..
ఉగాది పచ్చడి 'చేదు నిజాన్ని చెప్పకనే చెబుతోంది..
మనుషుల్లో పేరుకుపోయిన ఈర్ష్య,
అసూయలను తొలగిస్తే. ప్రతి పూటా పండగే..
బాధల చేదును గెలిస్తే.. బతుకంతా తీపే కదా..
'మనిషి' మేలును తలిస్తే.. నరుడే నారాయణుడు కాదా..



కడప కల్చరల్ : ప్రజలు ఎప్పటికీ ఆనందాన్నే కోరుకుంటారు. ముందెప్పుడైనా అలాంటి ఆనందం లభించి ఉంటే...అలాంటి సంతోషమే మళ్లీ కావాలని కోరుకుంటారు. అచ్చ తెలుగు ఆంధ్రుల అభిమానమైన పర్వదినం ఉగాది. ఈ సందర్భంగా ప్రపంచంలోని తెలుగు వారంతా నూతనత్వాన్ని కోరుతూ ఈ ఏడాదంతా సంతోషంగా గడిచిపోవాలని కోరుకుంటారు. మన తెలుగు నాట దాదాపు ప్రజలంతా మరోసారి గత సంవత్సరం లాంటి ఆనందకరమైన రోజులను కోరుకుంటున్నారు. ఎవరైనా ఏడాదంతా చేతినిండా నగదు, దాదాపు అన్ని ముఖ్యమైన పనులు సులువుగా జరిగేందుకు ఆర్థిక, హార్థికసాయం ప్రభుత్వమే చేస్తుంటే, అలాంటి రోజులే మళ్లీ మళ్లీ రావాలని కోరడం సహజం. ఈ సంవత్సరం మరికొన్ని సంక్షేమ పథకాలు రావాలని, తమకు మరో ఐదేళ్లపాటు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా ఉగాది పండుగ దీవించాలని కోరుకుంటున్నారు. మరో ఐదేళ్లపాటు ఇలాంటి సంక్షేమ ప్రభుత్వమే ఉంటే తమ జీవితాలు ఆర్థికంగా, హార్థికంగా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా గడిచిపోతాయని ఆశిస్తున్నారు. ఉగాది కోయిల షడ్రుచులతోపాటు కమ్మటి సంక్షేమ గీతాన్ని వినిపించాలని కోరుతున్నారు. ఈ సంవత్సరం ఉగాదికి ఎన్నికల సందడి కనిపిస్తోంది. నానా పథకాలంటూ ఊరించి ఏ ఒక్కటీ అమలు చేయకుండా ఉసూరుమనిపించే ప్రభుత్వం వద్దేవద్దని, ఈ ఐదేళ్లపాటు కష్టనష్టాలను దాటుకునేలా ఆర్థికంగా ఎంతగానో సహకరించిన ప్రభుత్వమే మళ్లీ కావాలని కోరుకుంటున్నారు. .

నవరత్నాలు...షడ్రుచులు

ఉగాది పండుగ సందర్భంగా ఆరు రుచులు కలిసిన ప్రత్యేకమైన పచ్చడిని సేవించడం సంప్రదాయం. దాన్నే ఉగాది పచ్చడి అంటారు. దాంతోపాటు కొమ్మల్లో కోయిలమ్మలు కమ్మటి పాటను వినిపించాలని, ఏ లోటు లేని సమాజాన్ని గమనించిన కవులు తృప్తిగా మరింత ఆదర్శవంతమైన పాలన కోసం ఎదురుచూస్తూ వసంత గీతాలను ఆలపిస్తారు. వేద పండితులు భవిష్యత్తు గురించి క్లుప్తంగా వివరిస్తారు. భావి జీవితంపై ఆశలను రేకెత్తిస్తారు. ప్రస్తుతం ఎన్నికలు పూర్తయ్యాక తమ జీవితాలు మరో ఐదేళ్లపాటు సుస్థిరంగా ఉండేలా మరోమారు నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో తాము సుఖ సంతోషాలతో ఉండవచ్చని ఆశిస్తున్నారు.

సంప్రదాయం

భవిష్య జీవితంపై ప్రభుత్వం భరోసా కలిపిస్తుండడంతో ప్రజలు ఉగాదిని సంతోషంగా నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని తెలుగు లోగిళ్లను కొత్త వసంత శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దుకుంటున్నారు. ఆలయ ప్రాంగణాలలో పంచాంగ పఠనం ఏర్పాటు చేస్తున్నారు. పలు సాహితీ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ సందర్భంగా కవులను ఆహ్వానించి కవితాగానాన్ని ఆస్వాదిస్తారు.

మత సహనం

మన జిల్లాను మత సహనానికి మారుపేరుగా పేర్కొంటారు. మొన్నటి ముస్లిం ప్రముఖులు హకీమ్ మంజుమియా నుంచి నేటి పెద్దదర్గా వరకు మత సహనానికి గట్టి పునాదులు వేశాయి. ఉగాది సందర్భంగా దేవునికడప ఆలయంలో పలువురు ముస్లింలు ప్రార్థనలు నిర్వహిస్తారు. ఒంటిమిట్ట, రాయచోటిలలో కూడా ఈ ఆచారం ఉంది. ముస్లింలు ప్రార్థనలు నిర్వహించే సంప్రదాయం దాదాపు 200 సంవత్సరాల నుంచి ఉన్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

పంచాంగాలకు పెరిగిన డిమాండ్

కడప కల్చరల్ : ఉగాది సందర్భంగా పంచాంగాన్ని తిరగేయడం సంవత్సరమంతా జరగనున్న విశేషాల గురించి ముందే తెలుసుకోవడంలో ప్రజలకు ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ఈ సంవత్సరం కేవలం అంతటితో సరిపెట్టుకోకుండా రాజకీయాల గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి ప్రజల్లో బాగా పెరగడంతో మార్కెట్‌లో పంచాంగాలకు మంచి డిమాండ్ ఏర్పడింది.

పొలిటికల్ పంచాంగం

ఈ ఉగాది పంచాంగాన్ని పొలిటికల్ పంచాంగంగా పేర్కొంటున్నారు. నెలరోజుల్లో ఎన్నికలు ఉండడం, ఆ తర్వాత ఏ ప్రభుత్వం వస్తుందోనన్న ఉత్సుకత ప్రజల్లో బలంగా ఉండడంతో పంచాంగాల వినియోగం పెరిగింది. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత ఆసక్తి ప్రస్తుత ఎన్నికలపై నెలకొని ఉంది. ఎవరు గెలుస్తారో తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా క్రమంగా పెరుగుతోంది. సర్వేలను నమ్మలేక జ్యోతిష్యంపై ఆధారపడుతున్నారు. ప్రముఖ జ్యోతిష్యులు కూడా ఈ అంశాన్ని మినహాయించి మిగతా వివరాలను తెలుపుతున్నారు. రాజకీయాలపై ఆసక్తిగల వారు ఒకే పంచాంగం కాకుండా పలు రకాల పంచాంగాలను తిరగేస్తున్నారు. స్పష్టత లేకపోవడంతో ఉగాది నాడు వేద పండితులు చేసే పంచాంగ పఠనంలోనైనా విషయం తెలుస్తుందని ఎదురుచూస్తున్నారు.

మహిళలే ఎక్కువ

పదిహేను సంవత్సరాలుగా పంచాంగ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరిగిపోతోంది. ప్రముఖ పంచాంగకర్తలైన నాలుగైదు సంస్థలు, ప్రధాన పంచాంగ కర్తల తరం ముగియడంతో వారి వారసులుగా కుమార్తెలు పంచాంగాలను రూపొందిస్తున్నారు. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో బహుళ చెలామణిలో ఉన్న పంచాంగాలన్నీ మహిళలు రాసినవే కావడం విశేషం.



మార్కెట్‌లోని పలు రకాల పంచాంగాలు

క్రోధికి స్వాగతం!

- దేవాలయాల్లో పంచాంగ శ్రవణాలు, కవి సమ్మేళనాలు
- మార్కెట్లలో సందడి



ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు (ఫైల్)

మదనపల్లె సిటీ : ఆది పండుగ.. ఆనందాల పండుగ ఉగాది రానే వచ్చింది. మోడు వారిన చెట్లకు పూతలు చిగురించింది. మూగబోయిన కోయిలమ్మలకు రాగం నేర్పింది. పంచాగశ్రవణంతో ప్రజల్లో భక్తిభావం పెంపొందించింది. జీవితం షడ్రుచుల సంగమం కావాలని ఆది పండుగ వస్తూ ఆనందాన్ని వెంట తీసుకువచ్చింది. ఈ పండుగ రైతన్నల మోములో నవ్వుల సిరులు పండించాలని, మహిళల వెంట ఉండి విజయఢంకా మోగించాలని, విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరేందుకు బాసటగా నిలవాలని శ్రీ క్రోధినామ సంవత్సరానికి మన సారా స్వాగతం పలుకుదాం...

ఆనవాయితీగా పంచాంగ శ్రవణం

ఉగాది పండుగ రోజున సాయంత్రం దేవాలయాలు, ఇతర వేదికలపై పంచాంగ శ్రవణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మదనపల్లెలోని శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి, షిర్డిసాయిబాబా ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో వేదపండితులు పంచాగశ్రవణం చేస్తారు. మదనపల్లె రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణాలు జరుగుతాయి.

మార్కెట్‌లో సందడి

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, వాల్మీకిపురం ప్రాంతాలతో పాటు మండల కేంద్రాలో మార్కెట్లలో సందడి నెలకొంది. పూలు, మామడికాయలు, పండ్లు, మామిడి ఆకులు, వేపపూత, చెరుకుగడలు అమ్మకాలు ఊపందుకున్నాయి.

ఘనంగా యదుల్లా హుసేనీ సాహెబ్ ఉరుసు



గురువుల మజార్ వద్ద పీఠాధిపతి సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ప్రార్థనలు నిర్వహిస్తున్న సినీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, తదితరులు

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న కడప అమీన్‌పీర్ (పెద్దదర్గా)దర్గాలో కొలువైన హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా యదుల్లా హుసేనీ చిష్తివుల్ ఖాద్రీ సాహెబ్ ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గంధం, సోమవారం ఉరుసు ఉత్సవాలు జరిగాయి. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ భక్తులతో కలిసి గురువుల మజార్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉత్సవాల్లో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు, దర్గా భక్తుడు ఏఆర్ రెహమాన్ పాల్గొని గురువుల మజార్‌ను దర్శించుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉరుసు ఉత్సవాల్లో స్థానిక భక్తులతోపాటు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో దర్గా ఆవరణం భక్తులతో కళకళలాడుతోంది.

వేసవి తీవ్రతను తట్టుకునేందుకు సత్వర చర్యలు

- జిల్లా వ్యాప్తంగా పంచాయతీలు, మున్సిపాలిటీలు, ముఖ్య కూడలి ప్రదేశాలలో చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి
- పశువులకు నీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశం



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి : జిల్లాలో ఎండ తీవ్రత, వడగాల్పుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సంబంధిత శాఖలు సత్వరం చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎండ తీవ్రత, వడగాల్పుల బారిన పడకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖలు క్షేత్రస్థాయిలో చలివేంద్రాల ద్వారా తాగునీరు, ప్రాథమిక చికిత్స వంటి చర్యలను సత్వరం అమలు పరచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీలు, పంచాయతీలలోని ముఖ్య కూడలి ప్రదేశాలలో చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని జిల్లాలోని పశువులకు నీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలన్నారు. వేసవిలో పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనులపై అవగాహన కల్పించాలని పశుసంవర్ధకశాఖ అధికారులకు సూచించారు. ఏప్రిల్ నుంచి జూన్ మాసం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండవచ్చన్న ప్రకృతి విపత్తుల శాఖ సూచనల నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. కార్మికులు, కూలీలు అధికంగా పనిచేస్తున్న ప్రదేశాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఆయా నీటి ప్రాజెక్టుల ద్వారా చేపట్టిన నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన విధంగా పర్యవేక్షణ చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతాలలో నీడ కల్పించే ఏర్పాట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వడదెబ్బ లక్షణాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌డీ కేంద్రాలలో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలోని ప్రతి ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో నీటి సదుపాయం కల్పించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 101 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని, వేసవిలో అధిక ఉష్ణోగ్రతకు ఏర్పడే విద్యుత్ సమస్యలపై తగిన పర్యవేక్షణ చేయాలని, ఇందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితిపై తగు పర్యవేక్షణ చేయాలని, భూగర్భ జలాలు అడుగంటిన గ్రామాలు, మండలాల వివరాలను సమర్పించాలని భూగర్భ జల శాఖ అధికారికి సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, డ్వామా, వైద్య, ఆరోగ్యం, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, సమాచార శాఖ, వ్యవసాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం బలిజపల్లె గంగమ్మ

- జాతరకు రెండువందల ఏళ్లకుపైగా చరిత్ర
- ప్రతి ఏటా లక్షమందికి పైగా జాతరలో పాల్గొంటున్న భక్తులు
- టెన్త్, ఇంటర్ పరీక్షలు పూర్తయినందున ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగే అవకాశం
- రేపు అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్న అమ్మవారి వేడుక



జాతరలో భక్తులకు దర్శనమిచ్చే అమ్మవారి రూపం (ఫైల్)

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బలిజపల్లెలో వెలసిన గంగమ్మ తల్లి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంతో విశిష్టత సంతరించుకుంది. ఆ గ్రామంలో గంగమ్మ స్వయంభుగా వెలసిందని పెద్దలు చెబుతున్నారు. ప్రతి ఏటా ఇక్కడ నిర్వహించే జాతరకు రెండువందల ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. ఒకేఒక రోజు జరిగే ఈ జాతరకు లక్షమందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ఇష్టమైన నైవేద్యాలు సమర్పిస్తారు. జాతరలో పాల్గొని అమ్మవారిని పూజించి పనులు ప్రారంభిస్తే తప్పక నెరవేరతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందువల్ల బలిజపల్లె గంగమ్మ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. కాగా బుధవారం అర్ధరాత్రి నుంచి గంగమ్మ జాతర ప్రారంభం కానుంది. ప్రతి ఏడాది జాతరలో లక్షమందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ ఏడాది టెన్త్, ఇంటర్ పరీక్షలు పూర్తయినందున భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని నిర్వాహకులు అంచనావేసి అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో బలిజపల్లె గంగమ్మ జాతర రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి గాంచడం విశేషం.

సంప్రదాయాల సమ్మేళనం

బలిజపల్లె గంగమ్మ జాతర అనేక సంప్రదాయాల సమ్మేళనం అనే చెప్పాలి. అమ్మవారి జాతరను బలిజపల్లె, తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు కలిసి నిర్వహిస్తారు. అందువల్ల తొలుత బలిజపల్లె జాతర నిర్వాహకులు జాతర తేదీని నిర్ణయించి అనంతరం తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె నిర్వాహకులతో వారివారి గ్రామాల్లో చర్చించి జాతర తేదీని ఖరారు చేస్తారు. అనంతరం ఒక ఆదివారం జాతరకు అంకురార్పణ చేసి ఆ తరువాత వచ్చే గురువారం జాతరను నిర్వహిస్తారు. అయితే జాతరకు ముందురోజు అర్ధరాత్రి నుంచే అమ్మవారి వేడుక అంగరంగ వైభవంగా ప్రారంభమవుతుంది. పై మూడు గ్రామాలకు చెందిన వారు అమ్మవారికి వివిధ రకాల సాంగ్యాలతో జాతరను ఘనంగా నిర్వహిస్తారు.

బలిజపల్లెలో రూపుదిద్దుకోనున్న అమ్మవారి ప్రతిమ

జాతరలో కొలువుదీరే గంగమ్మ ప్రతిమను బుధవారం రాత్రి నుంచి ఆ గ్రామంలోని ఓ వేపచెట్టు కింద దాదాపు ఆరుగంటల పాటు తయారు చేస్తారు. అనంతరం అమ్మవారి ప్రతిమను నిర్వాహకులు పూలరథంలో ఊరేగించుకుంటూ వేపమండలతో తయారు చేసిన గుడిలోకి ఊరేగింపుగా తీసుకొచ్చి కొలువు దీర్చుతారు. అమ్మవారు గుడిలోకి ఊరేగింపుగా వచ్చే సమయంలో భక్తులు పెద్దఎత్తున గంగమ్మకు ఇష్టమైన నైవేద్యాల ఎదురుగుంభంగా ఇచ్చేందుకు పోటీపడతారు. ఈ కారణంగా కేవలం యాభై అడుగుల దూరంలో ఉండే గుడిలోకి అమ్మవారిని తీసుకురావడానికి దాదాపు రెండుగంటల సమయం పడుతుంది. అమ్మవారిని గుడిలోకి తీసుకొచ్చే సమయంలోనే ఆ గ్రామానికి చెందిన పలువురు గంగమ్మకు విశేష పూజలు నిర్వహించి సాంగ్యాలు సమర్పిస్తారు. అమ్మవారు గుడిలో కొలువుదీరగానే జాతర ఊపందుకుంటుంది.

తుమ్మల అగ్రహారం నుంచి గండదీయలు

బలిజపల్లెలో కొలువైన గంగమ్మకు తుమ్మల అగ్రహారం పుట్టినిల్లని పెద్దలు చెబుతుంటారు. అందువల్ల తుమ్మల అగ్రహారానికి చెందిన మహిళలు జాతరలో అమ్మవారు గుడిలో కొలువుదీరగానే గండదీయలను సమర్పిస్తారు. అగ్రహారం మహిళలు అమ్మవారికి తీసుకొచ్చిన గండదీయలను చెల్లించే సమయంలో గంగమ్మను దర్శించుకునేందుకు క్యూలైన్‌లో ఉండే వేలాది మంది భక్తులను సైతం నిలిపివేస్తారు. గండదీయల చెల్లింపులో జాతర నిర్వాహకులు అగ్రహారం మహిళలకు ప్రత్యేకమైన గౌరవంతో వారు తీసుకొచ్చిన గండదీయలను గంగమ్మకు చెల్లించే ఏర్పాట్లు చేస్తారు.

నారపురెడ్డిపల్లె నుంచి నవధాన్యాలు

జాతర సందర్భంగా గంగమ్మ తల్లికి నారపురెడ్డిపల్లె నుంచి నవధాన్యాలు తీసుకొస్తారు. ఈ సందర్భంగా గంగమ్మ సోదరుడైన పోతురాజును తప్పెట్లతో ఉత్సాహంగా బలిజపల్లెకు తీసుకొస్తారు. పోతురాజు ఊరేగుతూ వచ్చే సమయంలో భక్తులు కర్రసాము, ఐదడుగు నృత్యాలు చేస్తూ కోలాహలంగా బలిజపల్లెకు చేరుకుంటారు.

సత్యమైన దేవత



బలిజపల్లె గంగమ్మ తల్లి సత్యమైన దేవత. గంగమ్మను పూజించి ఏ కార్యం తలపెట్టినా నెరవేరుతుంది. మా ఊళ్లో అందరు కూడా ముందు గంగమ్మను పూజించి ఏ కార్యమైనా తలపెడతారు. సంక్రాంతి అంతటి సందడైన పండగ ఈ జాతరే. యాడయాడో ఉండే బిడ్డలు, బంధువులు వస్తారు. ఆ తల్లి జాతర వల్ల నాబోటి ముసిలోల్లంతా రెండురోజులు ఆనందంగా కూడా ఉంటాము. - చల్లా రంగమ్మ, తుమ్మల అగ్రహారం, రాజంపేట

ప్రత్యేక రైలు గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మీదుగా రాజస్థాన్ రాష్ట్రంలోని భగత్‌కి కోటికి వెళ్లే ప్రత్యేక రైలు గడువును మే 1వ తేది వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. భగత్‌కి కోటి (04811) నుంచి ఈనెల 18, 27 తేదీల్లో బయలుదేరే రైలు కడప మీదుగా కోయంబత్తూరుకు వెళుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో కోయంబత్తూరు (04812) నుంచి ఈనెల 22, మే 1 తేదీలలో బయలుదేరి రాజస్థాన్‌లోని భగత్‌కి కోటికి చేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్ : విద్యుత్ బిల్లును ఆన్‌లైన్ ద్వారా సురక్షితంగా చెల్లించవచ్చని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ రమణ అన్నారు. సోమవారం ఆయన విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రానికి వెళ్లి వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులను 24/7 గంటలు, 365 రోజుల్లో ఎప్పుడైనా ఎక్కడి నుంచి అయినా, సెలవు దినాలలోనైనా చెల్లించ వచ్చన్నారు. చెల్లించిన వివరాలు తక్షణమే ఆన్‌లైన్ ద్వారా చూసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించడం పూర్తిగా సురక్షితమైన మార్గమని, ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలియజేశారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగదు

- టీడీపీ అభ్యర్థి రామ్‌ప్రసాద్‌రెడ్డి హుందాతనంగా ప్రవర్తించాలి
- అవినీతి, అక్రమార్కులు ఎవరో ప్రజలకు బాగా తెలుసు
- మేమెప్పుడూ వైఎస్సార్ కుటుంబానికి విధేయులమే..


సరస్వతిపల్లె, ఉడుంవారిపల్లె మైనార్టీలతో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు

రామాపురం : రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిపై టీడీపీ అభ్యర్థి రామ్‌ప్రసాద్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం తగదని రామాపురం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గడికోట జనార్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్లపు విశ్వనాథరెడ్డి, సర్పంచ్ మునీర్‌బాషా, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. రాంప్రసాద్‌రెడ్డి ప్రచారంలో భాగంగా వాడిన భాషపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అవినీతి, అక్రమార్కులకు పాల్పడుతున్నారని విమర్శలు చేస్తున్నావని, ఎవరు అవినీతి పరుడు, అక్రమార్కులో ప్రజలకు తెలుసని అన్నారు. వారు ఆదివారం సరస్వతిపల్లె, ఉడుంవారిపల్లె మైనార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2012లో కాంగ్రెస్ పార్టీ తరఫున రాయచోటిలో రామ్‌ప్రసాద్‌రెడ్డి పోటీ చేస్తే డిపాజిట్ కూడా దక్కలేదన్నారు. 2014లో మీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పుల పార్టీ గుర్తు తరఫున కూడా నీవు పోటీ చేస్తే కేవలం 2,500 ఓట్లు వచ్చాయన్న విషయాన్ని గుర్తు చేశారు. మీ కుటుంబానికి రాజకీయ భిక్ష పెట్టిందే వైఎస్సార్ అన్న విషయాన్ని మరిస్తే ఎలా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో ప్రజలు కష్టాలు పడుతుంటే అప్పుడు మీరు ఎక్కడికి పోయారు? అప్పుడు ఈ ప్రాంత ప్రజలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. అదే ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కరోనా రోగులకు అండగా నిలిచారని, సొంత డబ్బులు రూ.30 లక్షలు ఖర్చు పెట్టి నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటికీ ఆనందయ్య మందును పంపిణీ చేయించారన్నారు. శ్రీకాంత్‌రెడ్డికి సభ్యత, సంస్కారం ఉందన్నారు. రౌడీ, గుండాలా వ్యవహరించే విధానం మీదని, ప్రశాంతంగా పచ్చటి పల్లెల్లో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ లబ్ధి పొందాలనుకోవడం మీ అవివేకానికి నిదర్శనమన్నారు. వైఎస్సార్, జగన్ ఫొటోలను పెట్టుకుని శ్రీకాంత్‌రెడ్డి ఓట్లు అడుగుతున్నాడని వ్యంగ్యంగా మాట్లాడుతున్నావు, నీవు చంద్రబాబు ఫొటో పెట్టుకోకుండా , పార్టీ పేరు చెప్పకుండా ఎన్నికల ప్రచారం చేస్తున్నావా అంటూ ఎద్దేవా చేశారు. శ్రీకాంత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎంత కృషి చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. రాయచోటిని జిల్లా కేంద్రం ఏర్పాటు చేయడమే కాకుండా, అభివృద్ధి చెందిన పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి, పలవల వెంకటరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి ఆదినారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ రవిశంకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్‌రెడ్డి, వైస్ సర్పంచ్ చంద్రయ్య, మురళీధర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి, రామ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారలేదు..
తామెప్పుడూ వైఎస్సార్‌సీపీనే..

వైఎస్సార్‌సీపీని వదిలి టీడీపీలో చేరినట్లు ప్రకటనలు చేయడం సమంజసం కాదని, రామాపురం మండలం సరస్వతిపల్లి గ్రామం ఉడుంవారిపల్లె మైనార్టీలు ప్రకటించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి ఆ కుటుంబం వెంటే నడుస్తున్నామని వారు చెప్పారు. ఆదివారం ప్రచారంలో భాగంగా తమ గ్రామానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు తాము టీడీపీ పార్టీలో చేరినట్లు వార్తలు రాయించారన్నారు. అందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. మా కుటుంబాల సంక్షేమం కోసం నాడు దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి, నేడు జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాటుపడ్డారన్నారు. ఆదివారం రాత్రి బలవంతంగా పార్టీ కండువాలు కప్పి తప్పుడు ప్రచారం చేసుకోవడం రాంప్రసాద్‌రెడ్డికి ఆ పార్టీ అనుచరులకు తగదని పాడవువారిపల్లి గ్రామస్తులు సూచించారు. వారిలో మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా, దొర సత్యరెడ్డి, రమణ, మాజీ సర్పంచ్ వెంకటరమణ, ఈశ్వరయ్య, ఇర్షాద్, గంగులయ్య, సులేమాన్, ఇర్షాద్, రసూల్, అబ్దుల్, మునాఫ్, గౌస్‌మోద్దీన్, మహ్మద్ గౌస్ బాషా, సలాం, హుసేన్‌ఖాన్, రహీం ఖాన్, షఫీ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మీరు ఏం చేశారో చెప్పండి

ఒక ప్రజాప్రతినిధిగా పోటీ చేస్తున్న వ్యక్తి మాట్లాడాల్సిన మాటలేనా అవి అని కడప జిల్లా మాజీ రైతు డిపో మేనేజర్ నాగ సుబ్బారెడ్డి.. టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డిని ఉద్దేశించి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీరు ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నారని, రౌడీయిజం చేయాలని ప్రోత్సహిస్తున్నారా అని తెలిపారు. మీరు, మీ తండ్రి కాలంలో ఏమి చేసినారో ప్రజలకు చెప్పండి లేదా మీ పార్టీ చేసిన ఘన విజయాలు వుంటే ప్రజలకు చెప్పి ఓట్లు అడగండి తప్పులేదన్నారు.

ఆస్తి కోసం మనవడి అమానుషం

- అవ్వను కూడలిలోని మండుటెండలో కూర్చోబెట్టిన వైనం
- ఆపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం


అవ్వను ఎండలో కూర్చోబెట్టి ఆందోళనకు దిగిన మనవడు కేశవ

కురబలకోట : అవ్వకు చెందిన విలువైన ఇంటిలో తమకు భాగం కావాలని మనవడు సోమవారం మండలంలోని అంగళ్లు కూడలిలో ఆందోళనకు దిగాడు. అరగంట పాటు తీవ్ర ఉద్రిక్త, ఉద్వేగ పరిస్థితులు నెలకొన్నాయి. చివరకు అధికారుల జోక్యంతో ఆందోళన విరమించాడు. పోలీసులు, అధికారుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

అంగళ్లుకు చెందిన డి.లక్ష్మీదేవమ్మ వయోవృద్ధురాలు. వయస్సు 90కి పైనే. ఈమెకు ఆదిలక్షుమ్మ, ఉత్తమ్మ, భారతి అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మీదేవమ్మకు అంగళ్లు కుంట స్థలంలో ఇల్లు ఉంది. ఈ ఇంటిని ఆమె తన కుమార్తె భారతికి 20 ఏళ్ల క్రితమే రిజిష్టర్ చేసి ఇచ్చింది. అయితే ఉత్తమ్మ కుమారుడు కేశవ (చంద్రశేఖర్‌రెడ్డి) ఇంట్లో తమకు భాగం కావాలని కొంత కాలంగా అవ్వతో గొడవ పడుతున్నాడు. న్యాయం చేయాలని తెలిసిన వారికి చెబుతూ వచ్చాడు. ఎన్నాళ్లయినా ఎవరూ పట్టించుకోలేదని సోమవారం అవ్వ లక్ష్మీదేవమ్మను ఎత్తుకుని సమీపంలోని మూడు రోడ్ల కూడలిలో కుర్చీ వేసి మండుటెండలో కూర్చోబెట్టాడు. భార్యా బిడ్డలతో ఆందోళనకు దిగాడు. ఇంటి విషయమై తనకు న్యాయం జరగలేదని బాటిల్‌లో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను కూడా తలపై పోసుకున్నాడు. అగ్గిపెట్టె తీసి అంటించుకోడానికి ప్రయత్నించాడు. ఈ హఠాత్ పరిణామానికి కూడలిలోని వారంతా ఒక్కసారిగా నిశ్చేష్టులయ్యారు. అదే సమయంలో అటుగా స్థానిక ఎంపీడీఓ హరినారాయణ వచ్చారు. కేశవ ఆత్మహత్యాయత్నాన్ని స్థానికుల సాయంతో నిలువరించారు. అగ్గిపెట్టె, బాటిల్‌ను వెంటనే అక్కడున్న వారు లాక్కున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామ కార్యదర్శి శేషగిరికుమార్ హుటాహుటిన అక్కడికి చేరుకుని కేశవను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఇరు వర్గాలతో చర్చించారు. విచారించి తగు న్యాయం చేస్తామని చెప్పడంతో కేశవ శాంతించాడు. కాగా, లక్ష్మీదేవమ్మ కుమార్తె భారతిని విచారించగా తనకు పెళ్లి కాకముందే 20 ఏళ్ల క్రితమే తల్లి తన పేరిట ఇంటిని రిజిష్టర్ చేయించిందన్నారు. ఇది ఆమెకు వ్యక్తిగతంగా సంక్రమించిన ఆస్తి అన్నారు. ఈ ఇంటి సమస్యపై లక్ష్మీదేవమ్మ వద్ద వివరాలు తెలుసుకోవాలని ప్రయత్నిస్తే వయోభారం వల్ల ఆమె నోట మాట కూడా రావడం లేదు. సివిల్ వివాదమైనందున కోర్టులో విషయం తేల్చుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎంపీ మిథున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ శ్రేణులు

రామసముద్రం : రామసముద్రం మండలానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు సోమవారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. దొడ్డిపల్లి ఆనంద, సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో నరసాపురం, బురుజుపల్లి, కురిజల, దొడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు తెలియజేశారు.

పంటలను నాశనం చేస్తున్న ఆవులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ఈటమాపురం పంచాయతీ మూగవారిపల్లె గ్రామ పొలాల్లో వందకుపైగా ఆవులు పంటలను నాశనం చేస్తున్నాయని ఆ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవులను బయట ప్రాంతాలకు తోలి వచ్చినా మరలా పొలాల్లోకి వచ్చి మామిడి కాయలు, కర్బూజ, నువ్వుల పంటలను నాశనం చేస్తున్నాయని వారు తెలియజేస్తున్నారు. కొన్ని ఆవులను బంధించి దొడ్డిలోకి తరలించామని, ఎవరైనా ఆవుల యజమానులు ఉంటే వాటిని తీసుకెళ్లాలన్నారు. అలా కాకపోతే కాశినాయనకు తరలించేందుకు కూడా గ్రామస్తులు సిద్ధ పడుతున్నారని తెలిసింది.

రోడ్డు ఆక్రమణ


జేసీబీతో రోడ్డును తొలగిస్తున్న దృశ్యం

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గం నుంచి గూడరేవుపల్లెకు ఉన్న రోడ్డును సైతం ఆక్రమణ దారులు కబ్జా చేస్తున్నారు. గూడురేవుపల్లె రోడ్డుకు పక్కన కొత్తగా మరో రోడ్డు వేయడంతో కబ్జాదారుల కన్ను పాత తారు రోడ్డుపై పడింది. అందులో భాగంగా జేసీబీలతో తారు రోడ్డును తొలగించే పనులు యథేచ్ఛగా చేపట్టారు. ఆదివారం కావడంతో అధికారులెవరూ అటువైపు చూడకపోవడంతో దర్జాగా ఆక్రమణ పనులు చేపట్టారు. రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పేలుడు పదార్థాల స్వాధీనం

కోలారు (కర్ణాటక): ముళబాగిలు తాలూకా నంగలి చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి పోలీసులు భారీ స్థాయిలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లికి చెందిన అసీఫ్ హజరతుల్లా అనే వ్యక్తి కారులో సోదాలు చేయగా 1600 జిలెటిన్ స్టిక్స్, 7 చుట్టల తీగలు, 6 డిటోనేటర్లు బయటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో ఓ వ్యక్తి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎందుకోసం వాటిని తరలిస్తున్నారనేది దర్యాప్తు చేపట్టారు.

అపరిమితమైనది మనిషి మెదడు


సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూష సుబ్బారావు

కురబలకోట : సృష్టిలో అనంత విశ్వం గురించి తెలుసుకోవడం ఎంత కష్టమో.. మనిషి మెదడు గురించి తెలుసుకోవడం కూడా అంతే కష్టమని సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. సోమవారం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రీ ప్రోగ్రామింగ్ ఆఫ్ మైండ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మనస్సు, బుద్ధి, ప్రజ్ఞ, ఉపాధి, ఉద్యోగాలకు ఆధారం మెదడేనన్నారు. మనిషి ప్రాణం నిలవడానికి గుండె ముఖ్యమైనా ఆలోచనలు, అనుభూతులకు మెదడే ముఖ్యమన్నారు. మెదడుతో ఆలోచించే మనిషి ఎన్నో అద్భుతాలు సృష్టించాడన్నారు. ఇది లేని మనిషి గురించి ఊహించలేమన్నారు. జీవచ్ఛవం కిందే లెక్కన్నారు. మనిషి మెదడుపై ఎన్నో పరిశోధనలు జరుగుతున్నా ఇంకా తెలుసుకోవాల్సినవి ఎన్నో ఉన్నాయన్నారు. ఇది మెమరీ చిప్‌లా పని చేస్తుందన్నారు. డేటాను నిల్వ చేసే సామర్థ్యం అపరిమితంగా ఉంటుందన్నారు. పాజిటివ్ థింకింగ్ మనిషికి మానసిక బలాన్ని ఇస్తుందన్నారు. ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కోవడంలో సహాయ పడుతుందన్నారు. ఎవరి జీవితమైనా వారు ఆలోచించే విధానం నిర్ణయాలను బట్టే ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. నిరుత్సాహంగా కాకుండా ఉత్సాహంగా ఉండడం వల్ల మెదడు చురుగ్గా పని చేస్తుందన్నారు. అంగ వైకల్యం, ఆర్థిక స్థితిగతులు, కుటుంబ వాతావరణం లాంటివి కూడా ఆలోచన సక్రమంగా ఉన్నప్పుడు వాటిని అధిగమించ వచ్చన్నారు. విద్యార్థులు చదివింది గుర్తు పెట్టుకోడానికి కూడా మెదడు పాత్ర కీలకమన్నారు. మనిషి శరీరాన్ని మానవ జీవితాన్ని శాసించగల అధినేతగా మెదడు పని చేస్తోందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన అన్నయ్య

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండూరు అన్నయ్య (23) అనే యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. లక్కిరెడ్డిపల్లి మండలం పందిళ్లపల్లి గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు రామకృష్ణ, అన్నయ్యలు పాల వ్యాన్‌లో పాలు తీసుకొని కలకడకు వెళ్లి డెయిరీలో దించి తిరిగి వస్తుండగా.. నారాయణరెడ్డిపల్లె పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ సంఘటనలో కుమారుడు అన్నయ్య అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రి రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. తండ్రి కళ్ల ముందే కుమారుడు మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

రాజంపేట పార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా సుబ్బమ్మ

ఒంటిమిట్ట : 1939లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా మండల పరిధిలోని కొత్తమాధవరం పంచాయతీ మల్లేశ్వరపురం గ్రామానికి చెందిన కోటపాటి సుబ్బమ్మను బరిలో దింపుతున్నట్లు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్దన్ తెలిపారు. ఈ సందర్భంగా జయవర్దన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ (ఏఐఎఫ్‌బీ) ఉందని, అన్ని శాసనసభ, లోక్‌సభ స్థానాలలో పోటీ చేస్తుందని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన సుబ్బమ్మను రాజంపేట నియోజకవర్గ ప్రజలు సింహం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

కసాయి తండ్రి

కుమారుడ్ని కొట్టి చంపిన వైనం


ముస్తఖీమ్ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : కన్న పిల్లలకు చిన్న గాయమైతే ఏ తండ్రి తట్టుకోలేడు. అయితే ఈ తండ్రిది రాతిగుండె. కుమారుడనే కనికరం లేదు. విచక్షణా రహితంగా కొట్టడంతో తన నాలుగేళ్ల కుమారుడికి చెయ్యి విరిగింది. విరిగిన చెయ్యితో రెండు నెలలుగా పసి బాలుడు బాధ పడుతున్నా తండ్రి హృదయం చలించలేదు. అంతటితో ఆగక ఆరోగ్యం బాగలేని కుమారుడ్ని విచక్షణా రహితంగా కొట్టడంతో ముస్తఖీమ్ (4) అనే బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన ప్రొద్దుటూరులోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని కాల్వకట్టకు చెందిన ఇమ్రాన్ ఆలీ ఎలక్ట్రీషియన్ పని చేస్తుంటాడు. అతనికి రుబీనా అనే కుమార్తెతోపాటు ముస్తఖీమ్ అనే నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. కుమారుడు పుట్టిన నాలుగు రోజులకే భార్య షాబిరున్ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఏడాదిన్నర క్రితం అతను రెండో పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి అతను కుమారుడ్ని విపరీతంగా కొట్టేవాడు. రెండు నెలల క్రితం ఇమ్రాన్ ఆలీ కొట్టడంతో కుమారుడి చెయ్యి విరిగింది. అయినా అతను బాలుడికి చికిత్స చేయించలేదు. మనవడిని చిత్రహింసలకు గురి చేస్తున్నారని తెలుసుకున్న ఉరుటూరులో ఉంటున్న బాలుడి అమ్మమ్మ మస్తాన్‌బీ 10 రోజుల క్రితం ప్రొద్దుటూరుకు వచ్చింది. పిల్లాడిని ఎందుకు కొట్టి చంపుతావు.. మాకు ఇస్తే తీసుకెళ్లి పోషించుకుంటామని అడిగింది. అయితే అతను అందుకు ఒప్పుకోలేదు. నా మనవడికి ఏమైనా జరిగితే బాగుండదని హెచ్చరించి అక్కడి నుంచి ఆమె వెళ్లిపోయింది.

బాలుడి మృతదేహాన్ని ఖననం చేయాలని ప్రయత్నిస్తుండగా..

కుమారుడు ముస్తఖీమ్‌ను ఆదివారం రాత్రి నుంచి తండ్రి విపరీతంగా కొట్టసాగాడు. తండ్రి కొట్టిన దెబ్బలకు తట్టుకోలేని బాలుడు కింద పడి ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. కొద్ది సేపటి తర్వాత చూసుకోగా చనిపోయాడు. సాధారణ మృతిగా చిత్రీకరించి ముస్తఖీమ్ మృతదేహాన్ని సోమవారం ఉదయం ఖననం చేయాలని సిద్ధం చేసుకున్నారు. మనవడు ముస్తఖీమ్ చనిపోయాడని బంధువులు మస్తాన్‌బీకి ఫోన్ చేశారు. దీంతో ఆమె తన కుమార్తెలను వెంట బెట్టుకొని హుటాహుటిన ప్రొద్దుటూరుకు వచ్చింది. వారిని చూసిన ఇమ్రాన్ ఆలీ ఎందుకు ఇక్కడికి వచ్చారని కోపోద్రిక్తుడయ్యాడు. ఈ క్రమంలోనే బాలుడి మృతదేహానికి చుట్టిన గుడ్డను తీసి చూడగా రక్తపు గాయాలు కనిపించాయి. అనుమానం రావడంతో మస్తాన్‌బీ స్థానికుల సాయంతో వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించింది. ఆరోగ్యం బాగలేని నా మనవడు బాగోగులు చూడలేక అతన్ని కొట్టి చంపారని, అంతటితో ఆగక తమకు తెలియకుండా ఖననం చేయాలని ప్రయత్నించారని మస్తాన్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీకాంత్ తెలిపారు.